
సాక్షి
బాపట్ల
ఆదివారం । 15 । జనవరి । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1216 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 900 క్యూసెక్కులు విడుదల చేశారు.



వైభవంగా గోదాదేవి కల్యాణం

వేదాద్రి(జగ్గయ్యపేట): వేదాద్రి యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో శనివారం గోదాదేవి కల్యాణం వైభవంగా జరిపించారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శనివారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించ లేదు.

విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్

● తనిఖీలు ముమ్మరం ● ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏడాదిలో 11.70 కోట్లు జరిమానా ● 5460 మందిపై కేసులు నమోదు ● సిబ్బంది నిర్లక్ష్యంపైనా ...

బాపట్లటౌన్: అక్రమార్కుల చర్యలతో విద్యుత్ శాఖకు జరుగుతున్న నష్టంపై విజిలెన్స్ ఉక్కుపాదం మోపుతోంది. చౌర్యానికి పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వినియోగదారులపై కొరడా ఝుళిపిస్తూ వారి నుంచి కోట్ల రూపాయల అపరాధ రుసుమును వసూలు చేస్తోంది. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. అయితే అక్రమార్కులు అనధికారికంగా విద్యుత్ వాడుతూ ప్రభుత్వాన్ని వంచిస్తుండటంతో వీరికి అడ్డుకట్ట వేసేందుకు విజిలెన్స్ నడుంబిగించింది. ఇందులో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు దూకుడు పెంచారు. అక్రమ విద్యుత్ వినియోగం, చౌర్యం, పర్మిషన్ లేని ఓవర్ లోడ్ వినియోగం. మీటర్ల ట్యాంపరింగ్ వంటి అక్రమాల అంతు తేల్చే పనిలో నిమగ్నమయ్యారు. ఏడాది కాలంగా ఉమ్మడి జిల్లా పరిధిలో విజిలెన్స్ దాడులు విస్తృతంగా నిర్వహిస్తూనే ఉన్నారు.

రూ.11.70 కోట్ల జరిమానా వసూలు

విద్యుత్‌శాఖలో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని విద్యుత్ చౌర్యాన్ని పూర్తిస్థాయిలో నివారించేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లా విజిలెన్స్ అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా గతేడాది విద్యుత్ మీటరు ఉన్నప్పటికీ మీటర్‌లో రీడింగ్ నమోదు కాకుండా చేసి విద్యుత్ వాడుకుంటున్న 728 మందిని గుర్తించి వారి నుంచి రూ. 2.76 కోట్ల జరిమానా వసూలు చేశారు. విద్యుత్ లైన్ల నుంచి మీటర్లు లేకుండా అక్రమ కనెక్షన్లతో విద్యుత్ చౌర్యానికి పాల్పడిన 780 మందిని గుర్తించి వారి నుంచి రూ. 31.08 లక్షలు, ఒక కేటగిరిలో సర్వీస్ తీసుకొని వేరొక అవసరా లకు విద్యుత్‌ను వినియోగిస్తూ సంస్థ ఆదాయానికి గండికొడుతున్న 402 మందిని గుర్తించి వారివద్ద నుంచి రూ.1.17 కోట్లు, పరిమితి లోడ్‌తో కనెక్షన్ పొంది అనుమతి లేకుండా అధికలోడ్‌ను వినియోగిస్తున్న 3259 మందిని గుర్తించి వారి వద్ద నుంచి రూ. 5.75 కోట్ల జరిమానా వసూలు చేశారు. అదేవిధంగా బిల్లులు సకాలంలో చెల్లించకుండా పెండింగ్‌లో ఉన్న 291 మందిని గుర్తించి వారి వద్ద నుంచి రూ.1.71కోట్లు చెల్లించాలంటూ నోటీసులు జారీ చేశారు.



బాపట్లలో దాడులు నిర్వహిస్తున్న విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు (ఫైల్)

గతేడాదిలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో నమోదైన కేసులు

నెల	మొత్తం కేసులు	వసూలుచేసిన సొమ్ము
జనవరి	411	82.69 లక్షలు
ఫిబ్రవరి	300	67.83
మార్చి	412	84.87
ఏప్రియల్	483	79.18
మే	535	131.79
జూన్	458	113.55
జులై	452	109.65
ఆగష్టు	497	86.11
సెప్టెంబర్	403	93.43
అక్టోబర్	454	91.87
నవంబర్	539	114.05
డిసెంబర్	519	118.64
మొత్తం	5463	1173.66

చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవు

విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన బిల్లులు సకాలంలో చెల్లించకపోయినా, సర్వీస్ తక్కువలోడ్ తీసుకొని అధిక లోడ్ వినియోగించినా చర్యలు తప్పవు. అలాగే విద్యుత్‌లైన్ల నుంచి అక్రమ కనెక్షన్లు పొందినా, బహుళ అంతస్తుల యజమానులు ట్రాన్స్‌ఫార్మర్ లేకుండా విద్యుత్ వాడుతున్నా అలాంటి వారికి అపరాధ రుసుం విధిస్తాం. జరిమానా చెల్లించకుండా ఉన్న వ్యక్తులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. -కె.వి.ఎల్.ఎస్.మూర్తి, ఈఈ, విజిలెన్స్, విద్యుత్ శాఖ

'స్పందన' కార్యక్రమం రద్దు

బాపట్ల: సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 16వ తేదీ సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అలాగే సోమవారం కనుమ పండుగ సెలవు కావడంతో బాపట్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లాలోని బాధితులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

జగనన్న హయాంలో ప్రతిరోజూ పండుగే

మంత్రి మేరుగ నాగార్జున



వేమూరు సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న మంత్రి మేరుగ నాగార్జున

వేమూరు: జగనన్న ప్రభుత్వంలో రాష్ట్రంలోని ప్రజలందరికీ ప్రతిరోజు పండగేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. వేమూరు మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పండగలు అంటే సంస్కృతి సంప్రదాయాలను తెలియజేయడంతో పాటు పెద్దలు చూపిన మార్గంలో ముందుకు సాగాలన్న స్ఫూర్తిని అందస్తాయన్నారు. సంక్రాంతి రైతుల పండగన్నారు. తెలుగు లోగిళ్లకు సంక్రాంతి తొలి కాంతులు తీసుకు వస్తుందని చెప్పారు. శనివారం భోగి మంటలు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. భోగి పండగ పెద్దలను గౌరవించాలనన్న సందేశాన్ని సంక్రాంతి ప్రకృతిని, పశు సంపదను కాపాడుకోవాలన్న స్ఫూర్తిని, కనుమ పండగ తెలియజేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహన్, మేరుగ కిరణ్ నాగ్,మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, విష్ణుమొలకల వెంకటరెడ్డియ్య, గాజుల మోహన్, సజ్జా శ్రీనివాసరావు, గాజుల భాను ప్రకాశ్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాహుల్ తేజపై పీడీ యాక్ట్

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల టౌన్: నేరస్తులు నేరప్రవృత్తిని వీడనాడాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. బాపట్ల పట్టణంలోని విజయలక్ష్మీపురానికి చెందిన మంగళగిరి రాహుల్‌తేజ అలియాస్ కింగ్స్ రాహుల్‌పై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. అతడిపై రెండు హత్యాయత్న కేసులతో పాటు మొత్తం 8 కేసులలో నిందితుడిగా ఉన్నట్లు వివరించారు. రౌడీషీట్ ఉన్నప్పటికీ ప్రభుత్వం, పోలీస్ శాఖ ఆదేశాలను పాటించకుండా చట్ట వ్యతిరేకంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ దృష్టికి తీసుకెళ్ళి పీడీ యాక్ట్ నమోదుచేయటం జరిగిందన్నారు.

నకిలీ బంగారం అమ్మిన ఇద్దరు అరెస్ట్

బేస్తవారిపేట: నకిలీ బంగారు బిస్కెట్లు అమ్మిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు కంభం సీఐ రాజేష్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. సీఐ కథనం ప్రకారం .. పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన తురక సురేష్, అచ్చంపేటకు చెందిన గుంజి కోటేశ్వరమ్మ(అత్త, అల్లుడు) దొరికిన నంబర్లకు ఫోన్ చేసి పరిచయం చేసుకుంటారు. బంగారం బిస్కెట్లు అమ్ముతామని నమ్మిస్తారు. గత నెల 15వ తేదీన బేస్తవారిపేట మండలం చిన్న ఓబినేనిపల్లెకు చెందిన కాకర్ల గురువర్‌కుమార్‌తో ఫోన్‌లో పరిచయం పెంచుకుని మాయమాటలు చెప్పి రూ.2 లక్షలకు అర కేజీ నకిలీ బంగారం బిస్కెట్‌ను అమ్మారు. గురువర్‌కుమార్ బిస్కెట్‌ను చెక్‌చేయిస్తే నకిలీగా తేలింది. అమ్మిన వ్యక్తులకు ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్‌గా వస్తోంది. ఈనెల 11వ తేదీన బేస్తవారిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేసిన పోలీసులు శనివారం పందిళ్లపల్లె టోల్‌ప్లాజా వద్ద తురక సురేష్, గుంజి కోటేశ్వరమ్మలను అరెస్టు చేశారన్నారు. వీరిపై 2009లో పెదనందిపాడు, 2020లో సంతమాగులూరు, 2022లో తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదై ఉన్నాయన్నారు. కేసులో మరొకరిని అరెస్ట్ చేయాల్సి ఉందని, మూడు రోజుల్లోనే నిందితులను గుర్తించి అరెస్ట్ చేసిన ఎస్‌ఐ మాధవరావును అభినందించారు.

సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున



భట్టిప్రోలు: తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకమైన అతి పెద్ద పండుగ సంక్రాంతి అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పేర్కొన్నారు. ప్రతి ఇంట్లోని తెలుగు లోగిళ్లల్లో రంగు రంగుల రంగవల్లులు, హరిదాసు సంకీర్తనలు, కొత్త దుస్తులు, మరెన్నో సంబరాలతో మన సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచ దేశాలకు చాటి చెప్పే సంక్రాంతిని ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి జిల్లా ప్రజల కుటుంబాల్లో సంతోషాలను నింపాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సుపరిపాలనలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి బాటలో పయనిస్తూ, పండుగ శోభతో కళకళ లాడుతున్నాయని అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

హోరాహోరీగా ఎడ్ల బల ప్రదర్శన

సీనియర్స్ విభాగంలో కృష్ణా జిల్లా ఎడ్లకు మొదటి స్థానం

పర్చూరు: జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. అన్నంభొట్ల వారిపాలెంలోని గోరంట్ల రత్తయ్యచౌదరి ప్రాంగణంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఒంగోలు గిత్తల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన సీనియర్స్ పోలురాధ విభాగంలో కృష్ణాజిల్లా ఎడ్లజత మొదటి బహుమతి గెల్చుకున్నాయి. విజేతల వివరాలు.. కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం కళ్లవారిపాలేనికి చెందిన కళ్లం సాంబశివారెడ్డి, ఇదే జిల్లా కోడూరు మండలం విశ్వనాథపల్లికి చెందిన ఎలిశెట్టి ఉమామహేశ్వరరావు ఎడ్ల జతలు 3600 అడుగుల దూరం లాగి సంయుక్తంగా మొదటి బహుమతి, బాపట్ల జిల్లా చెరుకుపల్లికి చెందిన ఏమినేని మోహన్‌నాగరాజు ఎడ్ల జత 3318 అడుగుల దూరం లాగి ద్వితీయ, గుళ్లపల్లి కురపాలేనికి చెందిన మద్దిగిరి గోపిరాజు ఎడ్ల జత 3187.7 అడుగుల దూరం లాగి తృతీయ, దరివాడకొత్తపాలేనికి చెందిన రుద్రాచౌదరి, దీక్షాచౌదరి ఎడ్ల జత 3058.2 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతిని గెల్చుకున్నాయి. గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండపాటూరుకు చెందిన పోతిన లక్ష్మీత్‌చౌదరి ఎడ్ల జత 2833 అడుగుల దూరం లాగి ఐదో బహుమతిని గెల్చుకుంది. బాపట్ల జిల్లా ఇమ్మిడిశెట్టివారిపాలేనికి చెందిన కాట్రగడ్డ అర్జున్ ఎడ్లజత 2648.2 అడుగుల దూరం లాగి ఆరో బహుమతిని గెల్చుకున్నాయి. చిలకలూరిపేట మండలం పసుమర్రుకు చెందిన అంబటి ఏడుకొండలు ఎడ్ల జత 2438 అడుగుల దూరం లాగి ఏడో బహుమతి, చిలకలూరిపేట మండలం పురుషోత్తపట్నానికి చెందిన షేక్ బడే ఎడ్ల జత 2418 అడుగుల దూరం లాగి ఎనిమిదో బహుమతి గెల్చుకున్నాయి. 4 పళ్ల విభాగంలో మొత్తం 14 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. 15 నిమిషాల్లో నాలుగు పళ్ల విభాగంలో 10 క్వింటాల బరువు ఉన్న బండను లాగనున్నాయి. పల్నాడు జిల్లా గోపాలవారిపాలేనికి చెందిన మందపాటి లిఖితాచౌదరి ఎడ్లు, ఇక్కుర్తి గ్రామానికి చెందిన జైశ్రీ ఎడ్ల జతలు సంయుక్తంగా 4332.8 అడుగుల దూరం లాగాయి. అదే విధంగా పల్నాడు జిల్లా చాగంటివారిపాలేనికి చెందిన తొలిసూరి శ్రీరామ్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్ ఎడ్లజత 3295 అడుగుల దూరం లాగాయి. మార్టూరుకు చెందిన గౌతుకట్ల వెంకట కృష్ణ ఎడ్లజత 4101 అడుగుల దూరం లాగాయి. కర్నూలు జిల్లా బొల్లవరం గ్రామానికి చెందిన జస్వంత్ నాయుడు, జోగులాంబ గద్వాల్ జిల్లా కంచుపాడు గ్రామానికి చెందిన వడ్డెమాను ఆంజనేయరెడ్డి ఎడ్ల జతలు సంయుక్తంగా 3966.4 అడుగుల దూరం లాగాయి. ప్రకాశం జిల్లా గంగన్నపాలేనికి చెందిన యుఎస్‌ఆర్ బుల్స్ ఉమ్మారెడ్డి శ్రీవల్లి ఎడ్లజత 4555.6 అడుగుల దూరం లాగాయి. ప్రస్తుతం పోటీలు రాత్రి వరకు కొనసాగుతున్నాయి. 15వ తేదీ ఆదివారం 6 పళ్ల విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కొనకంచి సుబ్బారావు తెలిపారు.



4 పళ్ల విభాగంలో బండ లాగుతున్న ఎద్దు

సమాజాన్ని మేల్కొలిపేవే నాటికలు

సినీ దర్శకులు వైవీఎస్ చౌదరి, అనిల్ రావిపూడి



యద్దనపూడి: నాటికలోని పాత్రల్లో ప్రేక్షకులు తమను తాము చూసుకోవటం ద్వారా సామాజిక చైతన్యం పెరుగుతుందని సినీదర్శక నిర్మాత వైవీఎస్ చౌదరి అన్నారు. మండలంలోని అనంతవరం గ్రామంలో ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు శనివారం ప్రారంభించారు. తొలుత వైవీఎస్ చౌదరి నటరాజ పూజ నిర్వహించారు. దర్శకుడు అనీల్ రావిపూడి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అనంతవరం ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు నాటిక పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సమాజాన్ని మేల్కొలిపేలా నాటికలు కీలక పాత్రలు పోషిస్తాయని టీవీలు, సినిమాలు రాకముందు గ్రామీణులకు విజ్ఞానాన్ని, వినోదాన్ని నాటికలు అందించాయన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు జి.వెంకటసుబ్బారావు, తారక రామారావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటికలు..

తొలిరోజు కర్టెన్ కాల్ థియేటర్ హైదరాబాద్ వారు ప్రదర్శించిన పెట్రోమ్యాక్స్ పంచాయతీలో ఊరంటే పచ్చని పైర్లే కాదు ప్రేమ ఊసుల జంటలే కాదు దుర్మార్గపు ఆలోచనలు, ఎత్తుకు పైఎత్తులు ఉంటాయి. 50 ఏళ్ల కిందటైనా, ఇప్పటికైనా సమాజంలో జరుగుతున్న తీరు ఒకటేనని నేటి సమాజంలో మంచికి చెడుకి కర్కశత్వానికి మధ్య బలైపోతున్న వాళ్లే ఎక్కువంటూ చివరిగా న్యాయం ఎవరిదో మీరే చెప్పండంటూ ఇతివృత్తంగా సాగే కథే పెట్రోమాక్స్ పంచాయతీ.

18న కానిస్టేబుల్ మోడల్ పరీక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ కానిస్టేబుల్ మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. బ్రాడీపేట 2/7వ లైనులోని సంఘ జిల్లా కార్యాలయంలో కానిస్టేబుల్ పోస్టుల మోడల్ పరీక్ష ప్రచార పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీసుశాఖలో కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయాలని కోరిన డీవైఎఫ్ఐ నోటిఫికేషన్ విడుదల తర్వాత అభ్యర్థుల కోరిక మేరకు వయో పరిమితి పెంచాలని ఇతర సంఘాలను కలుపుకుని ఆందోళన చేసిందన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్ వివరాల కోసం 9490099992, 9100639089లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు ఎం.కిరణ్‌కబీర్, అఖిల్ పాల్గొన్నారు.

